క్లుప్తంగా

నేడు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

కపిలేశ్వరపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో ఉదయం 9 గంటలకు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నామని ఎంఈఓ కె.తాతారావు శుక్రవారం తెలిపారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల స్థితిగతులపై అవగాహన, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై తల్లిదండ్రుల భాగస్వామ్యం ప్రధాన లక్ష్యంగా సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల వేదికగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో విద్యార్థులకు ఆరోగ్య కార్డులు, ప్రోగ్రెస్ కార్డులను అందజేయనున్నట్టు ఎంఈఓ తాతారావు తెలిపారు.

సమాజ స్థితిగతులపై అవగాహన అవసరం



వెదురుమూడి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మహిళా పోలీసులు

కపిలేశ్వరపురం: విద్యార్థులకు సమాజ స్థితిగతులపై అవగాహన అవసరమని మహిళా పోలీస్ గెడ్డం ప్రమీల అన్నారు. వెదురుమూడి ఎంపీపీయూపీ పాఠశాలలో శుక్రవారం మహిళా సంరక్షణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వల్లూరు, వడ్లమూరు మహిళా పోలీసులు మాట్లాడుతూ చిన్నారులకు సమాజంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పేరుతో ఎదుటి వారి ప్రవర్తనను అర్థం చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అవగాహనపై ర్యాలీ



ట్రాఫిక్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్సై ఆచార్యులు

రామచంద్రపురం: ట్రాఫిక్ రూల్స్ సక్రమంగా పాటించకపోవడం వల్ల హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని అడిషనల్ ఎస్సై కేవీఎస్ఆర్ ఆచార్యులు అన్నారు. శ్రీ చైతన్యస్కూల్ విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్సై విచ్చేసి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళల సంరక్షణ సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న దాడులకు ఏ విధంగా నివారణ చర్యలు తీసుకోవాలి. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రసంగించారు.

ఆరుబయట చెత్త వేస్తే చర్యలు తప్పవు

రామచంద్రపురం: ఇంటికి వచ్చిన పారిశుధ్య కార్మికులకు మాత్రమే ఇంటి వద్దే చెత్తను అందించాలని ఎక్కడ పడితే చెత్తను వేయరాదని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన శుక్రవారం ఉదయం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఎక్కడా చెత్త వేయరాదని ఆరుబయట మలవిసర్జనను చేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజల సహకారంలో గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వార్డు శానిటరీ సెక్రటరీలు నిత్యం పర్యవేక్షణ చేస్తూ వార్డులు పరిశుభ్రంగా ఉండే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

రామచంద్రపురం రూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావానికి హిందువులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ సేవా భారతి జిల్లా కార్యదర్శి డీఎస్ఎంఆర్ శర్మ పిలుపునిచ్చారు. ద్రాక్షారామ గీతా మందిరంలో రామచంద్రపురం కండ కార్యవాహ బీవీఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలను సెక్యులర్ ముసుగులో కొన్ని రాజకీయ పార్టీలు పథకం ప్రకారం నాశనం చేస్తున్నాయన్నారు. హిందూ దేవాలయాలు, ఆస్తుల పరిరక్షణకు రాజకీయ ప్రమేయం లేని స్వయంప్రతిపత్తి కల్పించాలని వీహెచ్‌పీ జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని హైందవ శంఖారావం విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపక ప్రముఖ్ యాళ్ల వీవీ సత్యనారాయణ, భజరంగదళ్ జిల్లా సంయోజక్ తోట రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆళ్ల లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ముస్తాబైన పందిరి



ఏడిద సంగమేశ్వరస్వామి



రథం ఆలయంలో సుబ్రహ్మణ్య కల్యాణం జరుపుతున్న అర్చకులు



సోమేశ్వరంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సుబ్బారాయుడి షష్ఠికి సర్వం సిద్ధం

- ముస్తాబైన ఆలయాలు
- పురాతన ఆలయాల ప్రాశస్త్యం
- ఆధ్యాత్మిక, ఆర్థిక అంశాల కలబోతగా షష్ఠి ఉత్సవం
- నేడు ఉత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం: గ్రామాల వైభోగానికి ప్రతీక ఉత్సవాలు. ఉత్సవాలనగానే తీర్థాలు. తీర్థాల నిర్వహణకు వేదికలు ఆలయాలు. ఆలయం అగానే ఆధ్యాత్మికతకు నిలయాలు. ఇలా ఆధ్యాత్మిక, ఆర్థిక కార్యకలాపాలకు నెలవుగా గ్రామాలు వెలసిల్లుతుంటాయి. గత కాలంలో దేవతామూర్తుల ఆలయాల సందర్శనతో ఆధ్యాత్మిక పూజలతో పాటు ఆలయ ప్రాంగణాల్లో నిర్వహించే తీర్థాల్లో కొద్ది రోజులకు అవసరమైన సరకులను కొనుగోలు చేసి పట్టుకెళ్లేవారు. అలాంటి ఉత్సవాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవం ఒకటి. ఈ నెల 7న క్షేత్ర స్థాయిలోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలను షష్ఠి ఉత్సవాలకు ముస్తాబు చేశారు.

నియోజకవర్గంలో ప్రాశస్త్యం గల ఆలయాలు

మండపేట రూరల్ మండలం ఏడిద సంగమేశ్వరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం దక్షిణ కాశీ పురాతన ఆలయంగా పేరొందింది. ఇక్కడి శివలింగాన్ని ఇంద్రుడు ప్రతిష్ఠించినట్టు ప్రతీతి. ఈ ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరునితోపాటు సూర్యనారాయణ మూర్తి, వేణుగోపాల స్వామి కొలువై ఉన్నారు. ఇక్కడకు ఏటా జరిగే స్వామి అభిషేక కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు సందర్శిస్తుంటారు. షష్ఠి ఉత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆలయంలో తగిన ఏర్పాట్లు చేశారు. రాయవరం మండలం సోమేశ్వరంలో బాల త్రిపుర సుందరీ సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, పసలపూడి, వెదురుపాక గ్రామాల్లోని శివాలయాల్లోనూ షష్ఠిని ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. రాయవరం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, వెంటూరులో ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో షష్ఠికి తగిన ఏర్పాట్లు చేశారు. కపిలేశ్వరపురం మండలం అంగరలోని వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలో షష్ఠి ఉత్సవాలకు పెట్టింది పేరు. గత కాలంలో ఇక్కడ షష్ఠి ఉత్సవాలను నెల రోజుల పాటు నిర్వహించేవారు. మారిన ఆధునిక కాలంలో అధికాస్తా ఐదు రోజులకు మారింది.



అంగర గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

ఏర్పాట్లు పూర్తి...

నియోజకవర్గంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను రంగులతో సుందరీకరించారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి విశేష పూజలకు అర్చక స్వాములు సన్నద్ధమయ్యారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేశారు. తీర్థం నిర్వహణలో భాగంగా ఆలయాలు వద్ద వ్యాపార దుకాణాలు ఏర్పాటయ్యాయి. చిన్నారుల వినోదం కోసం రంగుల రాట్నం, జెయింట్‌వీల్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలోని మండపేట రూరల్, అంగర, రాయవరం పోలీసులు బందోబస్తుకు సిద్ధమయ్యారు. నిబంధనలు మేరకు భక్తులు భక్తులు దర్శనాన్ని పూర్తి చేసుకోవాలని, ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు చొరవతో కృషి చేయాలని పోలీసులు కోరారు.

షష్ఠి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కాజులూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లోని వంశపారంపర్య ధర్మకర్తలు, నిర్వాహక కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. రామచంద్రపురం పట్టణంతో పాటు రూరల్ మండలంలోని ద్రాక్షారామ, ఏరుపల్లి, వెల్ల, హసన్‌బాద, కాజులూరు మండలంలోని కాజులూరు, గొల్లపాలెం, ఆర్యావటం, ఉప్పుమిల్లి, పెనుమళ్ల, కె గంగవరం మండలంలోని కోటిపల్లి, పామర్రు, దంగేరు, గంగవరం, తామరపల్లి గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి మొదలుకుని ఆదివారం రాత్రి వరకూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు కల్యాణం, షష్ఠి మహోత్సవాలు జరుగుతాయి. ఇదులో భాగంగా ఆలయాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దిన నిర్వాహక కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో రమణీయంగా అలంకరించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహక కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో శుక్రవారం రాత్రి స్వామివారికి కల్యాణం నిర్వహించిన భక్తులు శనివారం వేకువజాము నుంచి షష్ఠి మహోత్సవాలను నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు నియోజకవర్గ పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. ఇందులో భాగంగా ఆర్కెస్ట్రా, చెంచునాటకం, కోలసంబరం, చింతామణి నాటకం, బుర్రకథ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజామున భారీ ఎత్తున పలు రకాల బాణసంచా కాలుస్తారన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

మండపేట: షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రథం ఆలయంలో ముందు రోజు శుక్రవారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అయినవిల్లి సోమనాథ నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కనులవిందుగా సాగింది. పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం స్వామివారి అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు సంగమేశ్వరంలో షష్ఠి ఉత్సవాలు

మండలంలోని ఏడిద సంగమేశ్వరంలో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం శోభారాణి తెలిపారు. దక్షిణ కాశీగా పేరొందిన ఉత్సవాల సందర్భంగా సంగమేశ్వరంలో తీర్థం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటలకు తాపేశ్వరం కోకిలవాణి కళాక్షేత్రం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

రాయవరంలో..

రాయవరం: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి ఉత్సవాలకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే షష్ఠి ఉత్సవాలకు ఆలయ కమిటీలు ఇప్పటికే ఏర్పాట్లు చేశాయి. గురువారం నుంచి ఆలయాల వద్ద సందడి నెలకొంది. మండలంలోని చారిత్రక శివాలయాలైన సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి, రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, పసలపూడి, మాచవరం, వెదురుపాక గ్రామాల్లోని శివాలయంలో షష్ఠి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి వారి దివ్య కల్యాణాన్ని పలు ఆలయాల్లో శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామపెద్దలు పెండ్లిపెద్దలుగా వ్యవహరించి కల్యాణాన్ని చేపట్టనున్నారు. సంతానం కలగని వారు, కుజ, కాల సర్ప దోషం ఉన్నవారు కల్యాణాన్ని చేయించుకున్నా, తిలకించినా దోషాలు పోతాయనేది భక్తుల విశ్వాసం. దీంతో కల్యాణాన్ని నిర్వహించాలని కోరుకునే వారితో పాటు నవ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు కల్యాణ తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

మానవసేవే.. మాధవసేవ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన తొగరు మూర్తి

రామచంద్రపురం: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో శుక్రవారం రామచంద్రపురం, కొమరిపాలెం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు 20 మంది రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ తొగరు మూర్తి ప్రారంభించారు. సమావేశంలో మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని రక్తదాన అవసరాన్ని గుర్తించాలని కోరారు. ఆపద సమయంలో రక్తం అందక ప్రతి 10 మందిలో నలుగురు చనిపోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్నవారు, ఆస్పత్రిలో గర్భిణులకు డెలివరీ సమయంలో పెద్ద ఆపరేషన్ సమయంలో బతికించుకోవాలంటే రక్తదాతలు అందుబాటులో లేక ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మూర్తి తెలిపారు. రక్తదానం చేయడం వల్ల బలహీనత వస్తుందని ఏ అధ్యయనం పేర్కొనలేదని, 18 నుంచి 60 సంవత్సరాల వయసు ఉన్న ఆరోగ్యవంతులు నిస్సంకోచంగా రక్తదానం చేయవచ్చని తెలిపారు. అనంతరం రక్తదాతలకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆపరేషన్ మేనేజర్‌లు గవర శ్రీను, అజ్జరపు సంతోష్ కుమార్, అనిల్ కుమార్, శ్రీలక్ష్మీ, విజయభాస్కర్, ఉలిశెట్టి బాబి, పేపకాయల రాంబాబు, రుద్రాచార్యులు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది డాక్టర్ సునీత, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



అధ్వానంగా ఉన్న కుయ్యేరు, గొల్లపాలెం రహదారిని పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కాజులూరు: కుయ్యేరు–గొల్లపాలెం రహదారి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో అధ్వానంగా ఉన్న పలు రహదారులను యూటీఎఫ్, ప్రజా సంఘాల నాయకులు సందర్శించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఈ రహదారిలో గొల్లపాలెం, కుయ్యేరు మధ్య రూ.36 కోట్లతో 13 కిలోమీటర్లు పొడవున రోడ్డు నిర్మాణానికి మూడేళ్ల క్రితం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ హయాంలో పనులు ప్రారంభించారన్నారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్యలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. వర్షాల సమయంలో గోతుల్లో నీరు నిలిచిపోయి సైకిళ్లు, మోటారుసైకిల్ వంటి వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాల పాలవుతున్నారన్నారు. ఆటో, ట్యాక్సీ వంటి వాహనాలు సైతం గోతులు దాటి వెళ్లేందుకు వీలు లేకుండా ఉందని అధికారులు స్పందించి తక్షణ చర్యల్లో భాగంగా కనీసం గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల సీపీఎం నాయకులు కురుపూడి భూచక్రం, పెంకే రవితేజ తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి రోజు పాఠశాలలు తెరవడం దారుణం

మండపేట: అతి పవిత్ర పుణ్య దినమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి ఉత్సవాల రోజున పాఠశాలలు, విద్యాసంస్థలు తెరవడం సమంజసం కాదని విశ్వహిందూ పరిషత్ సభ్యులు అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ, కేవీవీ సాయిరామ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం శర్మ మాట్లాడుతూ ప్రతీ ఏడాది షష్ఠి రోజున అన్ని విద్యాసంస్థలు సెలవు ప్రకటించేవన్నారు. కానీ ఈ ఏడాది సెలవు ఇవ్వకపోగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించడం పద్ధతి కాదని ప్రభుత్వం తీరును ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వం వ్యవహరించిన తీరు యావత్ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేసి పాఠశాలలకు సెలవు ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్, హిందూ ధార్మిక సంఘాల తరపున ఆయన కోరారు.

వార్డు సభ్యుడిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి

రాయవరం: చెల్లూరు గ్రామానికి చెందిన చుండ్రు వీర్రాజుపై గుర్తు తెలియని వ్యక్తి బీరు సీసాతో దాడి చేసిన ఘటనపై రాయవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామచంద్రపురం ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీర్రాజు నుంచి దాడి ఘటన వివరాలను మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అడిగి తెలుసుకున్నట్టు ఎస్సై బుజ్జిబాబు తెలిపారు. పంచాయతీ వార్డు సభ్యుడిగా ఉన్న వీర్రాజుపై జరిగిన దాడి స్థానికంగా కలకలం రేపింది.

వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి



సభలో ప్రసంగిస్తున్న రామకృష్ణ తదితరులు

రామచంద్రపురం: పీడీఎస్‌యూ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సమయంలో విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో సమాజంలో అవినీతి, అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ 50 ఏళ్ల స్ఫూర్తి సభ స్థానిక చెలికాని రామారావు స్మారక భవనంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఎల్ఐసీ సెంటర్ నుంచి మెయిన్ రోడ్‌లో ర్యాలి నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అమర వీరుల జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్ ఆవిష్కరించి నివాళులర్పించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ అధ్యక్షత వహించిన ఈ సభలో జాతీయ కన్వీనర్ రామకృష్ణ, ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామచంద్రరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, చీకట్ల వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భీమశంకరం, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు, అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, కరిపోతుల నవీన్, వీర, శైలజ, జ్యోతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్వారపూడి పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం

మండపేట: ద్వారపూడి కాశీవిశ్వనాథరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సవితాల సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఈ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు అనే నినాదం పేరుతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందుకు సంబంధించి పాఠశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన వివరించారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల దాతలు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గండి స్వామి ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతికి రైస్ మిల్లర్లు చొరవ చూపాలి

కాజులూరు: వరదలతో సతమతమవుతున్న కృష్ణా జిల్లాలోని ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు స్థానిక రైస్ మిల్లర్లు చొరవ చూపాలని మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. మండలంలోని జగన్నాథగిరిలో శుక్రవారం రఘురామా రైసు మిల్లును తహసీల్దార్ శివకుమార్ తదితర అధికారులు సందర్శించి ధాన్యం కొనుగోలు తీరుతెన్నులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో వరదల కారణంగా ఒకేమారు ధాన్యం విక్రయాలు ప్రారంభమై గొడౌన్ సదుపాయాలు పూర్తి స్థాయిలో లేకపోవటంతో కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. దీనిపై రైతుల ఇబ్బందులను తగ్గించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకూ స్థానిక రైసుమిల్లులు కృష్ణాజిల్లాలోని ధాన్యాన్ని దిగుమతి చేసుకోవలసిందిగా సూచించామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఈశ్వరరావు, సత్యనారాయణ, వీఏఏ వర్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మన దేశానికి మహా గ్రంథం అందించిన మహోన్నతుడు

- అంబేడ్కర్ వర్ధంతిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేటలో అంబేడ్కర్‌కు ఘన నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట, పార్టీ నాయకులు

మండపేట: రాజ్యాంగమనే మహాగ్రంథాన్ని మన దేశానికి అందించిన మహోన్నతుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాలను మండపేట, రూరల్ మండలంలోని పలు రాజకీయ పార్టీలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా జరిపారు. పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మెయిన్‌రోడ్డు వాణీమహల్ మహనీయుల సెంటర్ వద్ద విగ్రహాల కమిటీ సభ్యులు పొలమాల సత్తిబాబు, ముమ్మిడివరపు బాపిరాజు, కనికెళ్ల ప్రసాద్, సన్మాల ధనరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలతో అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, 30వ వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, షేక్ అండ్ షేక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, పార్టీ నాయకులు పెంకే గంగాధర్, పెంకే వెంకట్రావు, యరమాటి వెంకన్నబాబు, జొన్నపల్లి సత్తిబాబు, విప్పర్తి సింహాచలం, గనిపే శ్యామ్‌సుందర్, పెనుముచ్చి సుకుమార్, మొండి మురళి, గనిపే ఆనంద్, వాసిరెడ్డి అర్జున్, చిలుకూరి బుజ్జి, సంతస విశ్వాస్ కుమార్, దుగ్గిరాల రాంబాబు, మల్లువలస గణపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో..

కేశవరంలో అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యుడు యడ్ల రవి ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీపేటలో కొలువుతీరిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్, గుత్తుల రాజశేఖర్, గెద్దాడ చంద్రశేఖర్ తదితరుల పాల్గొన్నారు.

ఏడో వార్డులో ..

స్థానిక ఏడో వార్డులోని ఎస్సీ యూత్ ఘనంగా నిర్వహించారు. యూత్ సభ్యుడు చాపల వీరబాబు నాయకత్వంలో అంబేడ్కర్ స్మారకమందిరంలో వున్న అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి మహనీయుని సేవలు స్మరించుకున్నారు. గంధం ఆశీర్వాదం, చంద్రమళ్ల రవి, మందపల్లి చిన్నారి, తేజ పాల్గొన్నారు.

ద్వారపూడిలో..

ద్వారపూడి గ్రామంలో బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్రను వివరించారు. ఉపాధ్యాయులు ఆచార్యులు అబ్బులు, ధనలక్ష్మి, భ్రమరాంబ విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. సీనియర్ న్యాయవాది కొండేపూడి భరత్ కుమార్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఆయన పనిచేశారన్నారు. చీకటి బారిన పడిన వర్గాలకు ఆయన వెలుగు జ్యోతి నింపారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, న్యాయవాదులు ఎన్.వీరభద్రరావు, ఎస్పీఎస్‌కే కుమార్ స్వామి, కేవీవీ సత్యనారాయణ, కె.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: గ్రామాల్లో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, కాలేరు తదితరగ గ్రామాల్లో వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. దళిత, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దృఢమైన రాజ్యాంగాన్ని లిఖించి ప్రపంచానికి భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన ఘనత అంబేడ్కర్‌కు చెందుతుందన్నారు.

రేపు మండపేటలో గీతా జయంతి

మండపేట: మండపేటలో గీతా జయంతి మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహణ కమిటీ సభ్యులు జేసీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో శ్రీ మద్భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కొండపల్లి వారి వీధిలో ఉన్న జేసీ డిగ్రీకాలేజీ ప్రాంగణంలో ఉదయం 9:30కు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. మొదటి కేటగిరిలో 6, 7వ తరగతి విద్యార్థులకు ఆత్మసంయన యోగ అనే అంశంపై శ్లోక కంఠస్థ పోటీ ఉంటుందన్నారు. రెండో కేటగిరిలో 8, 9వ తరగతి విద్యార్థులకు 1 నుంచి 47 శ్లోకాల వరకూ పోటీ నిర్వహిస్తామన్నారు. 3, 4 కేటగిరిల్లో 18 సంవత్సరాలలోపు పిల్లలకు, 18 ఏళ్లు పైబడిన వారికి 18వ అధ్యాయాల్లోని శ్లోకాలు కంఠస్థ పోటీ పెడుతున్నట్టు తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి ఎస్.రఘునాథ్, టీటీడీ కార్యనిర్వహణాధికారి జే శ్యామలరావుల పంపిన ప్రకటన మేరకు తాను వివరాలు వెల్లడించినట్టు జేసీ ప్రసాద్ వివరించారు. అందరూ ఆహ్వానితులేనని విజ్ఞప్తి చేశారు.